క్షేమంగా దొరికింది!

- అమలాపురంలో కిడ్నాప్ అయిన బాలిక
- యర్రంశెట్టి వారిపాలెం వద్ద ఆచూకీ గుర్తింపు
- తల్లికి అప్పగించిన పోలీసులు
- పరారీలో కిడ్నాపర్

7

చిన్నారి తల్లి.. మనసు తల్లడిల్లి..

- కొడుకుని స్కూల్ బస్సు ఎక్కిస్తుండగా తల్లి వెనకాల వచ్చిన కుమార్తె
- బస్సు కింద పడి చిన్నారి మృతి



ఆలమూరు మండలం పెనికేరులో తుఫాన్ ప్రభావానికి దెబ్బతిన్న వరి కంకులను పరిశీలిస్తున్న బృందం

మొంథా తుఫాన్ నష్టాలపై

సమగ్ర నివేదిక

- నష్టాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిస్తాం
- ఆలమూరు, కొత్తపేట మండలాల్లో కేంద్ర బృందం పర్యటన
- రైతులతో ముఖాముఖి.. జిల్లాలో తుఫాన్ నష్టాలను వివరించిన కలెక్టర్

పెనికేరులో వరి పంట నష్టాలను పరిశీలించిన కేంద్ర బృందం

ఆలమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని, పంట నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలన మేరకు కేంద్రానికి సమగ్ర నివేదిక అందించనున్నట్టు కేంద్ర బృందం సభ్యులు వెల్లడించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో సంభవించిన పరిశీలనకు జిల్లాకు కేంద్ర బృందం మంగళవారం విచ్చేసింది. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని ఆలమూరు మండలం పెనికేరులో వరిపంట నష్టాలను, కొత్తపేటలో ఉద్యాన పంటల నష్టాలను కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర హోంశాఖ జాయింట్ కార్యదర్శి పౌసుమీ బసు నేతృత్వంతో కూడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ కె.పొన్నుస్వామి, వాటర్ రిసోర్స్ మంత్రిత్వశాఖకు చెందిన డైరెక్టర్ శ్రీనివాసా భైరి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తీ సింగ్, మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలెప్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీనాతోపాటు రాష్ట్ర పౌరసరఫరాల సంచాలకులు ఢిల్లీరావుతో కూడిన బృందం పంటనష్టాల అంచనాలను పరిశీలించింది. రైతుల ఆర్థిక పరిస్థితులనుబట్టి అవసరమయ్యే పరిహారాన్ని అందించే దిశగా కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని బృందం తెలిపింది. తొలుత పెనికేరులో ఖరీఫ్ వరి పంటలను పరిశీలించి రైతులతో ముఖాముఖీగా మాట్లాడారు. తుఫాన్ వల్ల వరి పైరు పూర్తిగా పడిపోవడంతోపాటు గింజగట్టిపడే దశలో ఉన్న గింజలు పూర్తిగా పాడైపోతున్నాయని, ముఖ్యంగా గింజ ఇరిగిపోతుందని, దీనివల్ల మిల్లర్లు కొనుగోలు చేయడానికి ముందుకురారని రైతులు వివరించారు.

ఫొటో గ్యాలరీ పరిశీలన..

తుఫాన్ నష్టాలను పరిశీలించడానికి విచ్చేసిన కేంద్ర బృందం ఆలమూరు మండలం పెనికేరులో ఏర్పాటుచేసిన తుఫాన్ నష్టాల ఫొటో గ్యాలరీని పరిశీలించారు. వరిపంట, ఉద్యానవన శాఖ పంటలు, ఆర్‌డబ్ల్యుఎస్, గృహనిర్మాణం, ఆర్‌అండ్‌బీ రోడ్లు, విద్యుత్‌శాఖలకు నష్టం కలిగించిన ఫొటోలను వారు పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. శాఖల వారీగా జిల్లాస్థాయి అధికారులతో వారు నేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, ఎ.రాజశేఖర్‌తోపాటు పలు శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



కొత్తపేట మండలం మద్దులమెరకలో తుఫాన్ ప్రభావానికి పడిపోయిన అరటిపంటను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

2,500 ఎకరాల్లో అరటికి దెబ్బ

దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించిన బృందం

కొత్తపేట, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో సుమారు 2,500 ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయని, అదేవిధంగా కూరగాయలు, తీగజాతి పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని కేంద్ర బృందం సభ్యులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వివరించారు. మంగళవారం కొత్తపేట మండలం కొత్తపేట శివారు మద్దులమెరకలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న అరటిపంటలను క్షేత్రస్థాయిలో కేంద్రం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆ బృంద సభ్యులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 22 మండలాల్లో జరిగిన నష్టాల వివరాలను వివరించారు. అలాగే తుఫాన్ సమయంలో తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలు, పునరావాస కేంద్రాలు, వారికి అందించిన తాత్కాలిక సహాయం, ఉపశమన చర్యలను కలెక్టర్ బృంద సభ్యులకు తెలిపారు. జిల్లాలో చెట్టుపడి ఒక మహిళ చనిపోయినట్టు కేంద్ర బృందానికి వివరించారు. పంటకోత నూర్పిళ్ల దశలో తుఫాన్ రావడం రైతులకు, వ్యవసాయ రంగానికి తీరని నష్టం వాటిల్లిందని వివరించారు. అలాగే ఆర్‌అండ్‌బీ, పంచాయతీ, ఆక్వా చెరువులు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, విద్యుత్ స్తంభాలు వంటి మౌలిక వసతులు దెబ్బతిన్నాయని, అయినప్పటికీ యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల సంచాలకులు ఢిల్లీరావు, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, ఉద్యాన శాఖాధికారి బీవీ రమణ, కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి పాల్గొన్నారు.



ఫ్యాక్టరీ కాంప్లెక్స్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, ఆర్డీవో కె.మాధవి

గ్రామీణ యువత ఉపాధి కల్పనకు పారిశ్రామిక ప్రణాళిక

ఉప్పలగుప్తం ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ద్వారా 300 మందికి ఉపాధి కల్పన

సీఎం వర్చువల్ శంకుస్థాపన.. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు సీఎం చంద్రబాబు పక్కా పారిశ్రామిక ప్రణాళిక అమలుచేస్తున్నారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఉప్పలగుప్తంలో 6.80 ఎకరాల్లో రూ.13.50 కోట్లతో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు మంగళవారం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు కాంప్లెక్స్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ స్థానికంగా సుమారు 300 మంది యువతకు ఉపాధి కల్పిస్తుందన్నారు. కొబ్బరి, మత్స్య సంపదల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రైతులకు, నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాంప్లెక్స్ ఏర్పాటుకు రహదారులు, ఇతర సౌకర్యాల కల్పనలో స్థానిక రైతులు ప్రభుత్వానికి సహకరించాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి విజ్ఞప్తి చేశారు. కాంప్లెక్స్ ఏర్పాటు అనంతరం ఉప్పలగుప్తం మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ పద్మజ, జిల్లా పరిశ్రమల అధికారిణి అరుణ, ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడి స్వామినాయుడు, స్పెషలాఫీసర్ డి.రాంబాబు, తహసీల్దార్ వాసా దివాకర్, ఎంపీడీవో జి.కృష్ణ, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, కూటమి నాయకులు చిక్కం ఉమేష్, రవణం మధు, పెయ్యల దుర్గారావు, సలాది శ్రీనివాసరావు, మధుర నరసింహమూర్తి, చిక్కం భీముడు, నాగులపల్లి రాజు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.



దివ్యాంగుడికి అండగా లోకేశ్

సొంత నిధులతో ట్రై స్కూటీ అందజేత

మంగళగిరి సిటీ/మండపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గం చెన్నూరుకు చెందిన దివ్యాంగుడు మోర్ల వెంకటేశ్వరరావుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు చేస్తున్న మంచి పనులను చూచి అభినందించేందుకు వెంకటేశ్వరరావు గత నెలలో చెన్నూరు నుంచి పాలకొల్లులోని మంత్రి నిమ్మల కార్యాలయానికి ఆటోలో వచ్చారు. చంద్రబాబుతో ఫొటో దిగాలనే కోర్కెను వెలిబుచ్చారు. అవకాశం వచ్చినప్పుడు తప్పకుండా కోర్కె నెరవేరుస్తానని నిమ్మల హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని మంత్రి నిమ్మల ట్వీట్ చేయగా, మంత్రి లోకేశ్... తన సొంత నిధులతో వెంకటేశ్వరరావుకు ట్రైస్కూటీ అందజేస్తానని ప్రతి స్పందించారు. ఇచ్చిన మాట మేరకు మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో దివ్యాంగుడు వెంకటేశ్వరరావుకు మంత్రి లోకేశ్ ట్రైస్కూటీని అందజేయడంతో ఆనందం వ్యక్తంచేశాడు.



గూఢసార్‌లెక్కడ!

ఉమ్మడి జిల్లాలో నిద్దరోతున్న నిఘా

మనలో ఒకడు.. మనతో పాటే ఉంటాడు.. మనలాగే ఉంటాడు.. ఆనుపానులు చూసుకుంటాడు.. ప్రమాదాన్ని పసిగడతాడు.. ఉన్నతాధికారులకు చేరవేస్తాడు.. ప్రమాదం జరగకుండా కాపాడతాడు.. ఇదీ గూఢచారి వ్యవస్థ.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ గూఢచారి వ్యవస్థ ఉంటుంది.. గతంలో అయితే వీళ్లు ఎవరనేది ఎవరికీ తెలిసేది కాదు.. ప్రస్తుతం గూఢసార్‌లెవరనేది అందరికీ తెలిసిపోతోంది.. నిఘా లేదు.. ఏం లేదు.. ప్రమాదాన్ని పసిగట్టే పనిలేదు.. బాస్‌లకు సేవ చేసుకుంటూ కొసరు పనులతో దర్జాగా గడిపేస్తున్నారు. ఢిల్లీలో బాంబ్ పేలుడు ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది..ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నిఘా వ్యవస్థపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

- ఢిల్లీ బాంబ్ పేలుడుతో ఉలిక్కిపడిన జిల్లా
- పోలీసుల తనిఖీలతో భయం..భయం
- కొసరు పనుల్లో ఉమ్మడి జిల్లా నిఘా విభాగం
- ప్రమాదాలను పసిగట్టలేని వైనం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సాంకేతికత వినియోగం.. నిఘా.. ఈ రెండు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో అత్యంత కీలకమైన భూమిక పోషిస్తాయి. యూనిఫాం వేసుకొని ఎన్నిసార్లు చక్కర్లు కొట్టినా చిక్కని వాటిని నిఘాతో పసిపగట్టి పనిపట్టవచ్చు. ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటన చూస్తే హృదయం కలచివేస్తోంది. పోలీసులు ముందుగా పసిగట్టకుండా ఏం చేస్తున్నారనే ప్రశ్న సర్వత్రా వినవస్తోంది. అయితే యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్, నిఘా వర్గాల సమన్వయంతో పెద్ద ఉపద్రవాన్ని తప్పించాయి. మారణహోమాన్ని మట్టుబెట్టాయి. మరి ఉమ్మడి జిల్లాల్లో నిఘా పటిష్ఠంగా ఉందా? అనే ప్రశ్నకు మేల్కోవాలనే సమాధానం వినబడుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

నిఘా విభాగం.. ఏం చేస్తుందంటే..

ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో నిఘా విభాగాల పాత్ర కీలకం. పూర్వం వీళ్లను వేగులు, గూఢచారులు అని పిలిచేవారు. పోలీసుల్లో విజిబుల్ పోలీస్.. యూనిఫాం వేసుకొని తనిఖీలు చేస్తుంటారు. యూనిఫాం లేకుండా ప్రజల్లో కలిసిపోయి తీగ లాగడం, కీలక సమాచారాన్ని ఒడిసిపట్టుకోవడం నిఘా విభాగాల (ఇన్‌విజిబుల్ పోలీసింగ్) ప్రధాన విధి. దీని ద్వారా ముందస్తు చర్యలకు మార్గం దొరుకుతుంది. చిన్న నేరాలను నుంచీ భారీ కుట్రలను భగ్నం చేయడం వరకూ వీళ్ల చేతల్లోనే ఉంటుంది. ఢిల్లీ బాంబు పేలుళ్లకు రెండు రోజుల ముందు కీలకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. గుజరాత్ ఏటీఎస్ పోలీసుల నిఘా విభాగం ఇచ్చిన సమాచారం ఆధారంగా జమ్ముకశ్మీర్, ఉత్తరప్రదేశ్ పోలీసులు, కేంద్ర ఏజన్సీలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఉగ్రవాదులను అరెస్టు చేశారు. భారీ కుట్రను భగ్నం చేశారు. ఇది కేవలం నిఘా విభాగాల వల్లనే సాధ్యపడింది.

నిఘా పెరగాలి..

ఉమ్మడి జిల్లాలో ఎన్నో కీలకంగా ఉన్నాయి.. పోలవరం ప్రాజెక్టు, గోదావరిపై వంతెనలు, పలు ఫ్యాక్టరీలు, ప్రధాన నగరాల్లో సాయంత్రం వేళ జనసమ్మర్థత ఎక్కువే. మెయిన్‌రోడ్లు కిటకిటలాడుతూనే ఉంటాయి. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌ల వద్ద ఈనాటికి మెటల్ డిటెక్టర్ వ్యవస్థ అనేది లేదు. రోజూ సుమారు 40 వేల మంది ప్రయాణించే రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు అయితే చాలా దారులున్నాయి. అయినా నిఘా లేదు. కార్తీకమాసం కావడంతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. అక్కడా ఇంతే.

కొసరు పనులతో సరి

పోలీసు శాఖలో ఉండే నిఘా విభాగం కీలకంగా వ్యవహరించాల్సి ఉన్నా అందుకు భిన్నంగా కొసరు పనులు వారికి ఎక్కువైపోయాయనే విమర్శలు ఉన్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ నిఘా (స్పెషల్ బ్రాంచ్-ఎస్‌బీ) పోలీస్ ఒకరు ఉంటారు. జిల్లా స్థాయిలో నిఘా సీఐ, డీఎస్పీకి నేరుగా వీరు సమాచారాన్ని చేరవేస్తూ ఉంటారు. వాళ్ల ద్వారా జిల్లా పోలీస్ బాస్ అయిన ఎస్పీకి.. అవసరమైతే అక్కడి నుంచి పైఅధికారులకు సమాచారం వెళుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో దాదాపు 75 పోలీస్ స్టేషన్లలోనూ నిఘా పోలీసులు ఉన్నారు. అయితే అధికశాతం వీళ్లందరూ జేబులు నింపు కోవడానికి పాస్‌పోర్టుల తనిఖీలు, ఇతర వ్యవహారాల్లో తల మునకలైపోయారు. ఎస్పీలకు భజన చేయడం, ఉన్నతాధికారుల సమావేశాలకు ఏర్పాట్లు చేయడం, ఆహార మర్యాదల్లో కొరత రాకుండా చూసుకోవడంలో నిమగ్నమవుతున్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, చివరికి ఉన్నతాధికారి సమావేశంలో కుర్చీ తక్కువైతే వెంటనే రప్పించడం కూడా నిఘా అధికారుల పనిగానే మారిపోయింది. దీంతో అసలు విధులకు సమయం చిక్కడం లేదు. జిల్లాలోని ఎస్పీకి నేరుగా అనుసంధానమై ఉండే ఎస్‌బీ పోలీసులంటే ఆయా పోలీస్ స్టేష న్లలోని సీఐ, డీఎస్పీ స్థాయి అధికారులు భయ పడుతూ ఉండే పరిస్థితి ఉంది. మూడు జిల్లాల్లోని ఒక జిల్లాలో పరిస్థితి మరీ అధ్వానంగా తయారైందనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్పీకి దగ్గరగా ఉండే ఎస్‌బీ అధికారులు సీఐలు, ఎస్‌ఐలను బెదిరిస్తూ తమ 'కార్యకలాపాలు' చక్కబెట్టుకుంటున్నారు.



రాజమహేంద్రవరంలో వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇప్పటికైనా ఓ కన్నేసి

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యమే కాకుండా ఇప్పటికైనా నిఘా విభాగాలను ఉన్నతాధికారులు పూర్తిగా పరిశీలించి ప్రక్షాళన చేయాల్సిన అవసరత కనిపిస్తోంది. పోలీస్ స్టేషన్లు, ఎస్పీల వద్ద భజన యూనిఫాంలకు స్వస్తి చెప్పి అనుభవం, నిబద్ధత ఉన్న వారిని నియమించాల్సిన అవసరత కనిపిస్తోంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లోని పార్కింగ్ ప్రాంతాల్లో నిఘా పోలీసులను నిరంతరాయంగా వినియోగించాలి. నిఘా (ఎస్‌బీ) విభాగం పోలీసుల పనితీరును బేరీజు వేస్తూ కనీసం నెలకోసారి అయినా సమీక్షిస్తూ ఉండాలి. కీలక సమాచార సేకరణ, వాటిని ఉన్నతాధికారులకు నివేదించడం, ప్రజల్లో మమేకమై సమాచారాన్ని సేకరించడం, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వంటి వాటిపై శిక్షణ ఇప్పించాలి. కొసరు పనులను పక్కన పెట్టించాల్సిన అవసరత కనిపిస్తోంది.



డివిజనల్ అధికారి కార్యాలయం నమూనా

ఒకే గొడుగు కిందకు..

పంచాయతీ పాలనలో కొత్త పంథా.. ఇప్పటికే పంచాయతీల వర్గీకరణ

డివిజన్ స్థాయిలో ప్రాంతీయ అభివృద్ధి అధికారుల కార్యాలయాల ఏర్పాటు

అమలాపురం రూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలకాలం అనంతరం పంచాయతీరాజ్ వ్యవస్థలో సమూల మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయడంతోపాటు పాలనాపరమైన సంస్కరణలకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పంచాయతీరాజ్ వ్యవస్థలో పదోన్నతులు లేక నిరుత్సాహంతో ఉన్న వారందరికీ వారివారి కేడర్లను బట్టి పదోన్నతులు కల్పించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ గాడిన పడిన వెంటనే పంచాయతీల్లోని కిందిస్థాయి సిబ్బందికి కూడా పదోన్నతులు కల్పించనున్నారు. పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతి పొందని వారు ఎవరూ లేరంటే ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడంతోపాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు ప్రాంతీయ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు పూర్తిగా స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తూ సంస్కరణలు తీసుకువచ్చారు. దీనిలో భాగంగా డివిజన్‌కు ఒక ప్రాంతీయ అభివృద్ధి అధికారి కార్యాలయం ఏర్పాటుచేయనున్నారు. పంచాయతీ పాలనను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వచ్చే నెలాఖరులోగా ప్రాంతీయ అభివృద్ధి అధికారుల కార్యాలయాలను ప్రారంభించనున్నారు. ప్రాంతీయ అభివృద్ధి అధికారి కార్యాలయంలోనే డీఎల్డీవో, డీఎల్పీవో, డ్వామా ఏపీడీ కార్యాలయాలు కొలువు తీరనున్నాయి. రెవెన్యూ తరహాలోనే పంచాయతీరాజ్‌లో మూడంచెల వ్యవస్థ ఏర్పాటు కానుంది. జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట, కాకినాడ జిల్లాలో పెద్దాపురం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరులలో ప్రాంతీయ అభివృద్ధి అధికారి కార్యాలయాలు ఏర్పాటుచేయనున్నారు. అమలాపురం డివిజన్‌కు సంబంధించి పేరూరు బీమభక్తునిపాలెంలో ప్రాంతీయ అభివృద్ధి అధికారి కార్యాలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల భవనాలు అందుబాటులోకి రావడంతో త్వరలోనే స్థానిక పాలనను ప్రాంతీయంగా ప్రారంభించే అవకాశం ఉంది.

పారదర్శక పాలనే లక్ష్యంగా..

స్థానిక సంస్థల పరిపాలనను మరింత పారదర్శకంగా పంచాయతీలను స్వర్ణ పంచాయతీలుగా మార్చుచేశారు. సచివాలయ స్థాయి నుంచి ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. దాంతో పంచాయతీల్లో నిధులు చెల్లింపులు, వసూళ్ల వంటివన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. పంచాయతీ నిధులు పక్కదారి పట్టకుండా ఆన్‌లైన్ పేమెంట్ విధానాన్ని స్వర్ణ పంచాయతీల ద్వారా అందుబాటులోకి తీసుకురాగా, ఇక ఆర్థిక సంఘం నిధులతోపాటు పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి ప్రణాళికలు రూపొందిస్తారు.







అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో జరిగిన యువజనోత్సవాల్లో నృత్య ప్రదర్శనలు.. నృత్య కళాకారిణిని అభినందిస్తున్న ఎంపీ హరీష్‌బాలయోగి

ఉత్సాహంగా యువజనోత్సవాలు

అమలాపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పల్లె సీమల ప్రకృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ జానపద నృత్యరీతులతో, ఉరకలెత్తిన ఉత్సాహంతో జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నాయి. జాతీయ సమైక్యతను చాటడమే కాకుండా శాస్త్రీయ, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అలరించారు. యువతలో దాగి ఉన్న కళా నైపుణ్యాలను వెలికి తీయడంతోపాటు సైన్స్ మేళా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అమలాపురం కిమ్స్‌వైద్య కళాశాల ప్రాంగణంలో స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో నిర్వహించిన యువజనోత్సవాలను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రెండు గంటలపాటు ఆయన యువజనోత్సవాలను తిలకించడమేకాదు, విజేతలకు బహుమతులనూ అందించారు. యువజన సర్వీసులశాఖ (సెట్రాజ్) ఆధ్వర్యంలో యువ నైపుణ్యాలను వెలికితీసే ప్రదర్శనకు జిల్లాస్థాయిలో 919 మంది యువతీయువకులు పాల్గొన్నారు. సెట్రాజ్ సీఈవో కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఈ పోటీలను నిర్వహించారు. జానపద నృత్యాలు, సైన్స్ మేళా ప్రదర్శనలు, కథలు రాయడం, కవిత్వం రాయడం, చిత్రలేఖనం, ఉపన్యాసం పోటీలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నిర్ణయం మేరకు నిర్వహించారు. ఆయా పోటీల విజేతలను సీఈవో కాశీవిశ్వేశ్వరరావు ప్రకటించారు. సైన్స్ మేళాలో ఎం.మోహన్ గ్రూపు ప్రథమ, జి.భార్గవిశ్రీనివాస గ్రూపు ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జానపదనృత్యంలో ఎల్.వెంకటలక్ష్మి గ్రూపు ప్రథమ, పి.అయిన గ్రూపు ద్వితీయ, కొండేటి సుమంత తృతీయ స్థానాలు సాధించాయి. జానపద గేయాల్లో కె.నాగలక్ష్మి గ్రూపు ప్రథమ, తోట నిఖిత గ్రూపు ద్వితీయ, ఎం.జ్యోతినాగప్రవల్లిక గ్రూపు తృతీయస్థానం, ఉపన్యాసంలో షారోన్ డాకే ప్రథమ, తమన్న సకీన ద్వితీయ, ప్రేమ్‌రెడ్డి తృతీయ స్థానాలు, కథలు రాయడంలో బి.సౌదామినిశ్రీకమలిక ప్రథమ, వి.జాహ్నవి ద్వితీయ, ఆర్‌ఎస్ దివ్యశ్రీప్రియ తృతీయ, చిత్రలేఖనంలో ఇ.సత్యవర్ధన్ ప్రథమ, కేవీపీ సంతోష్ ద్వితీయ, పి.మౌనిక తృతీయ, కవిత్వంలోమంచాల మోహిత్ ప్రథమ, ఎం.ఐశ్వర్య ద్వితీయ, ఎస్.సౌపర్ణిక తృతీయ స్థానాలు సాధించారు.

అపార్ ఐడీతో మెరుగైన సేవలు

నన్నయ యూనివర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ



జ్యోతిప్రజ్వలనతో వర్క్‌షాపును ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ రిజిస్ట్రీ(అపార్) ఐడీ ద్వారా మెరుగైన సేవలు పొందవచ్చునని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అపార్ వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి ఏబీసీ నోడల్ అధికార్లు, కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్ దాదాపు 300 మంది హాజరయ్యారు. నన్నయ పరీక్షల డీన్ ఆచార్య డి.కళ్యాణి కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి వీసీ ప్రసన్నశ్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అపార్ అమలుపై ఎన్ఈపీ-2010 కింద విన్నూతమైన, పరివర్తన కలిగించే ప్రక్రియ మొదలైందన్నారు. ప్రతి అభ్యాసకుడికి జీవితాంతం ప్రత్యేకమైన 12 అంకెల గుర్తింపు సంఖ్యగా భావించబడే అపార్ ఐడీ ఒక దేశం, ఒక విద్యార్థి, ఒక గుర్తింపు దార్శనికతను ప్రతిబింబిస్తుందన్నారు. విద్యాసౌలభ్యంతోబాటు పరిపాలనా సౌలభ్యాన్ని అపార్ పెంచుతుందన్నారు. డిజిలాకర్ ద్వారా సురక్షిత యాక్సస్ ద్వారా మార్క్‌షీట్లు, సర్టిఫికెట్లు, డిగ్రీల తక్షణ డిజిటల్ ధ్రువీకరణను ప్రారంభించడం ద్వారా భౌతిక డాక్యుమెంట్లపై ఆధారపడడం తగ్గిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలలు అపార్ వ్యవస్థను దేశవ్యాప్తంగా అమలు చేయడంలో చురుకుగా పాల్గొంటున్నాయని చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రిన్సిపాల్ పి.అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అపార్ ఐడీలు నూరుశాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు అందరూ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ సమాచార మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కోఆర్డినేటర్ రవి పాండే మాట్లాడుతూ ఆధార్ ఆధారిత ఇ-కెవైసి ధ్రువీకరణ ద్వారా అపార్ ఐడీలను ఉత్పత్తి చేసి ప్రతివిద్యార్థి డిజిలాకర్ ఖాతాకు లింక్ చేస్తున్నారని చెప్పారు. విద్య మౌలిక సదుపాయాలను అమలు చేయడంలో మన రాష్ట్రం ప్రగతిశీల రాష్ట్రాల్లో ఒకటిగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. కార్యక్రమంలో యాప్షీ అకడమిక్ కన్సల్టెంట్ బి.ఎల్లారెడ్డి, శ్రీకాంత్, నన్నయ పరీక్షల డీన్ ఆచార్య డి.కళ్యాణి, పరీక్షల కంట్రోలర్ ఎస్.లింగారెడ్డి, అడిషనల్ కంట్రోలర్ కె.దీప్తి, సహాయ రిజిస్ట్రార్ ఎస్.విజయకుమారి, సిస్టమ్ మేనేజర్ ఏవీఎం జ్యోతి పాల్గొన్నారు.

ఏలేరు ఆధునికీకరణపై బహిరంగ చర్చకు రావాలి

వైసీపీ నేతలకు మాజీ ఎమ్మెల్యే వర్మ సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలేరు ఆధునికీకరణకు కృషి చేసింది ఎవరు, అడ్డుకుంది ఎవరు అనే విషయంపై బహిరంగ చర్చకు రావాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ వైసీపీ నేతలకు సవాల్ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలేరు తదితర అంశాలపై కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనాడూ పిఠాపురం ప్రజలను పట్టించుకోని గీత ఇప్పుడు చుట్టపుచూపుగా వచ్చి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏలేరు ఆధునికరణ ఫేజ్-1 పనులను టీడీపీ ప్రభుత్వ హయాంలో 75శాతం పూర్తి చేశామని, ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ పనులకు టెండర్ పూర్తి చేసి సీఎం చంద్రబాబుతో శంకుస్థాపన చేయించి పనులు ప్రారంభించామన్నారు. అయితే వైసీపీ నేతలు కుట్రపన్ని జగన్ ద్వారా సదరు పనులు రద్దు చేయించారని విమర్శించారు.ఐదేళ్ల పాలనలో ఒక్కడుగు ముందుకు పడకపోగా, పనులను రద్దు చేసి నిధులు మురిగిపోయేలా చేశారన్నారు. సమావేశంలో ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, బొజ్జా సతీష్, కొండేపూడి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అప్రెంటిస్ అభ్యర్థులకు

రాత పరీక్ష, ఇంటర్వ్యూలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ ఉత్తీర్ణులైన అర్హులైన అభ్యర్థుల కోసం ఈనెల 13న ఉదయం 8 గంటల నుంచి తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా కోసం రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాల్ వర్మ మంగళవారం తెలిపారు. రాజమహేంద్రవరంలోని ప్రముఖ సంస్థ ఏపీ పేపర్ మిల్స్‌లో పనిచేయడానికి ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్, టర్నర్ ట్రేడులలో ఐటీఐ పూర్తి చేసిన వారు అప్రెంటిస్‌కు అర్హులని తెలిపారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జిరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ అప్రెంటిస్ ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని కోరారు.

రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్

రన్నరప్ తూర్పు



రన్నరప్ బహుమతి అందుకుంటున్న తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ క్రీడాకారులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఆర్‌డీటీ స్టేడియంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకూ జరిగిన 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్-2025లో తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ విభాగం జట్లు పలు విభాగాల్లో రన్నర్ అప్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో కడియం తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, రాజానగరం సీఎస్‌డీటీ జి.బాపిరాజు జట్టు రన్నర్ అప్‌గా నిలిచారు. వాలీబాల్‌లోనూ జిల్లా జట్టు రన్నర్ అప్‌లో నిలిచింది. స్పీడ్‌వాకింగ్‌లో రాజానగరం సీఎస్‌డీటీ జి.బాపిరాజు ద్వితీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన జిల్లా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులను కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్ అభినందిస్తూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం పెరుగుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. విధి నిర్వహణలోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో కాకినాడ మాస్టర్ స్విమ్మర్ల సత్తా



విజేతలను అభినందిస్తున్న డీఎస్డీవో సతీష్‌కుమార్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన 6వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2025లో కాకినాడ జిల్లా క్రీడాకారులు సత్తా చాటారని డీఎస్‌డీవో సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగవారం ఆయన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించారు. డీఎస్ఏ తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి విజేతలుగా నిలిచిన మాస్టర్ స్విమ్మర్లను ఆయనతోపాటు కోచ్ అప్పలనాయుడు అభినందించారు.

వృద్ధుడిని ఢీకొన్న బైక్

చికిత్స పొందుతూ మృతి..

మృతుడు మొక్కలతిప్ప వాసి

రాజానగరం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : రాజానగరంలో ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడ్డ బోనం సూర్యనారాయణ(70) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం మొక్కలతిప్ప గ్రామానికి చెందిన సూర్యనారాయణ రాజానగరంలో నివాసం ఉంటున్న కుమారుడి ఇంటికి ఐదురోజుల క్రితం వచ్చాడు. సోమవారం సాయంత్రం నడచి వెళ్తున్న సూర్యనారాయణను రాజానగరం ఊరిలో నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన సూర్యనారాయణను తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు పోలీస్‌లు తెలిపారు. ఈ మేరకు మృతుడి కుమారుడు ముత్యాలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జాతీయ పోటీలకు భోగాపురం విద్యార్థినుల ఎంపిక



పిఠాపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీలకు పిఠాపురం మండలం భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో అంతర జిల్లాల స్క్వాష్ పోటీల్లో అండర్-14 విభాగంలో జి.స్తుతి కీర్తన, అండర్-17 విభాగంలో ఆర్.వేణు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. వీరు రాబోయే జనవరి 9 నుంచి 15వ తేదీ వరకూ ఢిల్లీలో జరిగే జాతీయ స్క్వాష్ పోటీల్లో ఏపీకి ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపికైన బాలికలను, శిక్షణ ఇచ్చిన పీఈటీ సాయిజ్యోతిని పాఠశాల హెచ్ఎం సీహెచ్.సత్తిబాబు, విద్యాకమిటీ చైర్మన్ తోట ఆనందప్రసాద్, సర్పంచ్ నేపాల లక్ష్మి, ఎంపీటీసీ వెన్నపు నీలవేణి, డీవైఈవో సత్యనారాయణ, ఎంఈవోలు అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు పూర్తి సహాయ సహకారాలు

కాకినాడ ఎంపీ ఉదయ్



ఎంపీ ఉదయ్‌ను కలిసిన ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, పీడీలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడలకు తన పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన్ను ఎస్‌జీఎఫ్ కాకినాడ జిల్లా అడ్మిన్ కార్యదర్శి పి.సుధారాణి, కాకినాడ డివిజన్ కో-ఆర్డినేటర్ లంకా జార్జి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. కాకినాడలో స్క్వాష్, జూడో, అండర్-17 బాలుర ఖోఖో, అండర్-14, 17, 19 బాలబాలికలకు జిమ్నాస్టిక్స్, అండర్-11, 14, 17, 19 బాలబాలికలకు స్కేటింగ్, అండర్-19 బాలబాలికలకు హాకీ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఎంపీకి వివరించారు. స్క్వాష్, జూడో పోటీలు పూర్తయ్యాయని, మిగిలిన నాలుగింటిని వచ్చేనెల 10వ తేదీలోపు పూర్తిచేస్తామని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవ్వాలని ఆహ్వానించగా తప్పక వస్తారని ఎంపీ తెలియజేసినట్టు వారు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రవిచక్రవర్తి, పీడీలు ఇమ్మాన్యుయల్ రాజు, సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అబ్బో! ఎంత పొడుగో!



మలికిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దిండి గ్రామ సర్పంచ్ ముదునూరి శ్రీనివాస రాజు తన పెరట్లో పెంచిన అరటి చెట్టు సుమారు ఏడు అడుగుల పొడువున గెల వేసింది. ఇది చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంది. తమ బంధువులు మాల్దీవుల నుంచి అరటి మొక్కను తీసుకురాగా వారి వద్ద నుంచి ఒక పిలకను సేకరించి తన పెరట్లో వేసినట్టు రాజు చెప్పారు. ఇది తయారు కావడానికి సుమారు సంవత్సర కాలం పడుతుందని, పది అడుగుల వరకు గెల పెరుగుతుందని తెలిపారు. ఇది చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. దీనిపై కొవ్వూరు అరటి పరిశోధన సంస్థ సైంటిస్ట్ కె.రవీంద్రను వివరణ కోరగా ఇది పిసంగ్ సెరిబు రకం. ఈ రకములో మొగ పువ్వు ఉండకపోవడం వల్ల గెల అంతా ఆడ పువ్వులు(అరటి కాయలు) వచ్చి ఆకర్షణీయంగా కనపడుతుందన్నారు. ఇది మలేషియా, ఇండోనేషియాల్లో పెరుగుతుందని, దీన్ని అలంకరణ కోసం వాడతారు. ఈ గెలలో 200 పైబడి అత్తాలు, సుమారు వెయ్యి కాయల వరకు ఉంటాయని తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు

అనూ ఇమ్మాన్యుయేల్



'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

\- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

క్షేమంగా దొరికింది!



బాలికను తల్లికి అప్పగిస్తున్న అమలాపురం డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు

- బాలికను కాపాడిన మాలధారులు
- అమలాపురంలో కిడ్నాప్ అయిన బాలిక
- పి.గన్నవరం మండలం యర్రంశెట్టి వారి పాలెం వద్ద ఆచూకీ గుర్తింపు
- తల్లికి అప్పగించిన పోలీసులు
- పరారీలో కిడ్నాపర్

అమలాపురం/పి.గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో కిడ్నాప్ అయిన పదేళ్ల బాలికను పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారిపాలెం వద్ద కొందరు మాలధారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాలికను త ల్లికి క్షేమంగా అప్పగించడంతో కథ సుఖాంతమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న వైసీపీ నాయకుడు కముజు రమణ కుమార్తె నిషిత (10) ఇంటికి సమీపంలోనే ఉన్న ఓ ప్రైవేటు స్కూలులో 5వ తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం స్కూలు నుంచి రమణ సమీప బంధువైన పి.గన్నవరం మండలం ముంగండకు చెందిన మట్టపర్తి మీరా సత్యమూర్తి (చంటి) బాలికకు మాయమాటలు చెప్పి మోటారుసైకిల్ ఎక్కించుకుని తీసుకెళ్లిపోయాడు. పాప ఇంటికి రాకపోవడంతో స్కూలు యాజమాన్యాన్ని ఆరా తీసిన కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యమూర్తి బాలికను కాకినాడ తీసుకెళ్లి సెల్‌ఫోన్, సిమ్ కార్డు కొనుగోలు చేసే క్రమంలో బాలిక ఏడవడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా కాకినాడ, అమలాపురం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే కిడ్నాపర్ కాకినాడ నుంచి మండపేట, రావులపాలెం మీదుగా పి.గన్నవరం మండలంలోని ఆర్.ఏనుగుపల్లి శివారు కారుపల్లికి చేరుకున్నాడు. అక్కడ రాత్రి ఓ కొబ్బరితోటలో బాలికతో దాక్కున్నాడు. స్కూలు బ్యాగులు, షూలు వదిలి కాలినడకన ఆర్.ఏనుగుపల్లి నుంచి వేకువజామునే బయలుదేరి పి.గన్నవరం జంక్షన్ మీదుగా బెల్లంపూడి దగ్గరలోని యర్రంశెట్టివారిపాలెనికి బాలికను తీసుకెళ్లాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న ముంగండకు చెందిన కొందరు మాలధారులు సోషల్ మీడియా ద్వారా బాలిక కిడ్నాప్ విషయం తెలియడంతో ఆ బాలికను గుర్తుపట్టి సత్యమూర్తిని ప్రశ్నించడంతో బాలికను వదిలేసి పరారయ్యాడు. అప్పటికే పోలీసులకు సమాచా రం అందడంతో బాలికను తల్లికి అప్పగించారు. బాలిక ఆచూకీ కోసం కృషి చేసిన డీఎస్పీ ప్రసాద్, అమలాపురం సీఐ వీరబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు. బాలిక సత్యమూర్తికి వరుసకు మేనకోడలు అవుతుందని సమాచారం. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.42.90 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీస్వామి హుండీ ఆదాయం రూ.42,90,035 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయ ప్రధాన హుండీలను మంగళవారం లెక్కించగా 73 రోజులకు గాను రూ.42,90,035 ఆదాయంతో పాటు 4 గ్రాముల బంగారం, 35 గ్రాముల వెండి వచ్చినట్టుగా ఏసీ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణాధికారి జిల్లా దేవాదాయ శాఖాధికారి వి.సత్యనారాయణ హాజరయ్యారు. లెక్కింపు కార్యక్రమంలో అర్చకులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుడి సన్నిధిలో సత్యదీక్షాపరులతో పడిపూజ

రాత్రి 8 గంటలకు ప్రారంభం

దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 27రోజులపాటు అత్యంత నియమనిష్ఠలతో సత్యదీక్షలు స్వీకరించిన దీక్షాపరులతో పాటుగా అయ్యప్ప దీక్షాపరులతో బుధవారం రాత్రి పడిపూజా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి 8 గంటలకు పడిపూజ ప్రారంభమవుతుంది. కార్యక్రమానికి దూరప్రాంత సత్యదీక్షాపరులు, గిరిజన దీక్షాపరులు ఇరుముడులు స్వీకరించి రత్నగిరికి చేరుకుంటారు. బుధవారం రాత్రికి కొండపై బస చేసి గురువారం వేకువజామున సత్యదేవుడికి ఇరుముడులు సమర్పించి దీక్షా విరమణ చేయనున్నారు. దీక్షా విరమణలకు అన్న వరం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.

అదృశ్యమైన పదో తరగతి విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో అదృశ్యమైన పదో తరగతి విద్యార్థి యాళ్ళ నిహార్ ఆచూకీని ఎస్‌ఐ లక్ష్మీకాంతం కనిపెట్టి మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. నిహార్‌ను తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లాలని మందలించడంతో సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన విషయం తెలిసిందే. దీనిపై ఎస్‌ఐ లక్ష్మీకాంతం విస్తృత గాలింపు నిర్వహించి సామర్లకోటలో ఉన్న నిహార్‌ను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి అతడి తల్లిదండ్రులు యాళ్ళ చిన్నారావు, అనంతకు అప్పగించారు.

రూ.5 లక్షల నగదు, అర కాసు బంగారం చోరీ

పెద్దాపురంలో ఘటన

పెద్దాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలోని బ్యాంకు కాలనీలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పెంకే సింహాచలం ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.5 లక్షల నగదు, అర కాసు బంగారం దోచుకెళ్లినట్టు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఇంట్లో అందరూ బంధువుల ఫంక్షన్‌కు వెళ్లడంతో ఎవరూ లేరని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లో నగదు, బంగారం దోచుకెళ్లినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మౌనిక తెలిపారు.

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి అయ్యప్పస్వామి దర్శనం కోసం శబరిమల వెళ్తున్న భక్తులకు రైల్వే శాఖ శుభవార్త అందించింది. విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్, హైదరాబాద్, కాచిగూడ, కాకినాడల నుంచి కొల్లాం, కొట్టాయంలకు పెద్దసంఖ్యలో ప్రత్యేక రైళ్ల సర్వీసులను ఏర్పాటుచేసింది. అందులో కాకినాడ నుంచి సామర్లకోట మీదుగా ఏర్పాటుచేసిన 18 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తన కార్యాలయం ద్వారా ప్రకటించారు. భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట మీదుగా నడుపుతున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు వచ్చిన సమచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది.

07109 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-కొట్టాయం మధ్య ప్రతీ సోమవారం కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరనుంది. ఈ రైలు మంగళవారం 5.30 గంటలకు కొట్టాయం చేరుకోనుంది. నవంబరు 17 నుంచి 2026 జనవరి 19 వరకూ నడవనున్న ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నవంబరు 17, డిసెంబరు 1,8,15,22,29, జనవరి 5,12,19 తేదీల్లో 9 ట్రిప్పులుగా ప్రతీ సోమవారం నడువనుంది. ఈ రైలు కాకినాడలో మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి సామర్లకోటకు మధ్యాహ్నం 1.20 గంటలకు చేరుతుంది. రాజమహేంద్రవరం నకు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుని నిడదవోలుకు 2.35 గంటలకు చేరుతుంది.

07110 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కొట్టాయం-కాకినాడ మధ్య ప్రతీ మంగళవారం కొట్టాయం నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు మరుసటి రోజు అర్ధరాత్రి 12 గంటలకు కాకినాడకు చేరుకోనుంది. నవంబ రు 18 నుంచి 2026 జనవరి 20 వరకూ నడువనున్న ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నవంబరు 18, డిసెంబరు 2,9,16,23,30 జనవరి 6,13,20 తేదీలలో 9 ట్రిప్పులుగా ప్రతీ మంగళవారం నడువనుంది. ఈ రైలు నిడదవోలుకు రాత్రి 8.37 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరానికి రాత్రి 9.22 గంటలకు, సామర్లకోటకు రాత్రి 9.52 గంటలకు, కాకినాడకు రాత్రి 12 గంటలకు చేరుతుంది.

ఈ ప్రత్యేక రైళ్లు సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలారిపెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, పోడనూర్, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకుళం మీదుగా కొట్టాయం చేరుకుంటాయి. మొత్తం 1,319 కిలోమీటర్ల దూరంలో 26 స్టేషన్లలో ఆగనున్నాయి. రైళ్లల్లో ప్రయాణించే అయ్యప్ప భక్తులు తమ సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయంలో రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని పీఆర్వో కార్యాలయం నుంచి ప్రకటించారు.

చిన్నారి తల్లి.. మనసు తల్లడిల్లి..



మృతిచెందిన చిన్నారి హరిణి

- కొడుకుని స్కూల్ బస్సు ఎక్కిస్తుండగా తల్లి వెనకాల వచ్చిన కుమార్తె
- బస్సు కింద పడి చిన్నారి మృతి

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ బస్సు కింద పడి ప్రమాదవశాత్తు మూడేళ్ల చిన్నారి మృతిచెందింది. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వెలిచేరుకు చెందిన నాగిరెడ్డి రాజు- సురేఖ దంపతులకు కుమారుడు పవన్, కుమార్తె హరిణి వరలక్ష్మి (3) సంతానం. పవన్ ఆత్రేయపురం మహర్షి విద్యా నికేతన్‌లో ఎల్‌కేజీ చదువుతున్నాడు. మంగళవారం తల్లి సురేఖ కుమారుడు ఉదయ పవన్‌ను స్కూల్ బస్సు ఎక్కించేందుకు రోడ్డు మీదకు వచ్చింది. ఆమె వెనకాల కుమార్తె కూడా వచ్చింది. ఆ విషయం తల్లి గమనించలేదు. పవన్‌ను స్కూల్ బస్సు ఎక్కడంతో ముందుకు కదిలింది. బస్సు వెనుక వైపు హరిణి ఉన్నట్టు బస్సు డ్రైవర్ గుర్తించకపోవడంతో వెనక చక్రం కింద పడి చిన్నారి హరిణి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందడతో సురేఖ బోరున విలపించింది. ఎస్‌ఐ రాము ఘటనా స్థలానికి చేరుకున్నారు. సురేఖ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. వెలిచేరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైల్వే స్టేషన్లో 5 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

యువకుడి అరెస్ట్

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో మంగళవారం సామర్లకోట రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.25 వేల విలువైన 5 కిలోల గంజాయిని సామర్లకోట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీలో జరిగిన భారీ పేలుడు నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానితుడిగా ఉన్న వ్యక్తి వద్ద బ్యాగ్‌లను సోదా చేయడంతో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 25 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న జార్ఖండ్‌కు చెందిన బిట్టు కుమార్‌యాదవ్ (26)ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, జీఆర్పీ ఎస్‌ఐ వాసు తెలిపారు. అతడిని బుధవారం విజయవాడ రైల్వేకోర్టులో హాజరుపరుస్తామన్నారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

గండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం పంచాయతీ రామేశ్వరంలో ఉన్న పవర్‌గ్రిడ్‌లో పనిచేస్తున్న మానస్ పాండా, నాగేంద్రకు విద్యుత్ షాక్ తగిలి గాయాలయ్యాయి. వారిని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది. పాండా ఒరిస్సా, నాగేంద్ర సూరంపాలెంకు చెందిన వారిగా సమాచారం.



పెద్దాపురంలో ఆసుపత్రిలో బాధితులు



బైక్ చోరీలు చేస్తున్న ముగ్గురు మైనర్ల అరెస్ట్

రూ.5 లక్షల విలువైన 6 ద్విచక్రవాహనాల స్వాధీనం : అన్నవరం ఎస్‌ఐ



పట్టుబడ్డ వాహనాలతో అన్నవరం పోలీసులు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుర అలవాట్లకు బానిసై బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మైనర్లను మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం జాతీయ రహదారిపై అరెస్ట్ చేసినట్టు అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల్లో వారి నుంచి రూ.5 లక్షల విలువైన 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురిని జువైనల్ ప్రొబేషనరీ అధికారి ముందు హాజరుపరిచినట్టు తెలిపారు.

ఇరిగేషన్ ఎస్ఈ పరిశీలన

కిర్లంపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం ముక్కోలు బెడ్ రెగ్యులేటర్ వద్ద వాలు కాలువ క్రాడ్ బండ్ కొట్టుకుపోయింది. దీన్ని మంగళవారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాధ్ పరిశీలించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ బస్వా వీరబాబుతో కలిసి ఏలేరు వాలు కాలువ వెంబడి ఉన్న గట్లను పటిష్టం చేసేందుకు శాశ్వత పరిష్కారం చూపుతామని.. దీనిలో భాగంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఇరిగేషన్ డీఈ రవికుమార్‌ను కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. ముక్కోలు గ్రామ సర్పంచ్ జ్యోతుల రాంబాబు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్, అనపర్తి సూరిబాబు ఉన్నారు.



వాలుకాలువ గట్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్

తాళ్లూరులో సినిమా షూటింగ్



షూటింగ్ నిర్వహిస్తున్న చిత్రబృందం

గండేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండల తాళ్లూరు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం మంగళవారం సినిమా షూటింగ్‌తో సందడిగా మారింది. కన్నడ హీరో చందు, హీరోయిన్ సునీత నటిస్తున్న జాజారా చిత్ర సన్నివేశాలను డైరెక్టర్ ప్రభు చిత్రీకరించారు. గజేంద్రపుష్కరిణిలో ఫైటింగ్ సీన్లు తీశారు. ఈ హీరో హీరోయిన్లు కన్నడలో పలు చిత్రాల్లో నటించారని, తెలుగులో తొలి పరిచయమని.. తర్వాత మురారి, రామచంద్రపురంలో షూటింగ్ జరుగుతుందని యూనిట్ సభ్యులు పేర్కొన్నారు. షూటింగ్ తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు.

అన్నవరంలో పోలీసులు అప్రమత్తం

ఢిల్లీ ఘటన నేపథ్యంలో తనిఖీలు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేలుళ్ల ఘటన నేపథ్యంలో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి వేలాదిగా భక్తులు వస్తున్నందను జిల్లా ఎస్పీ ఆదేశాలతో అన్నవరం పోలీసులు అప్రమత్తం అయ్యారు. గ్రామంలో ఉన్న ప్రైయివేట్ లాడ్జిలను తనిఖీ చేయడంతో పాటుగా ఆర్టీసీ కాంప్లెక్స్, పార్శిల్ కార్యాలయాలు, వాహన తనిఖీలు చేపట్టారు. రద్దీ ప్రదేశాల్లో ఎవరైనా బ్యాగ్‌లు మరిచిపోయినా, వదిలిపెట్టి వెళ్లిపోయినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. లాడ్జిల్లో ఎవరు దిగుతున్నారు వంటి పూర్తి వివరాలు తప్పనిసరిగా రికార్డు చేయాలని కోరారు. తనిఖీల్లో అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తదితరులు ఉన్నారు.



అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

కాకినాడలో ట్రక్ క్యాబిన్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రూ. 20 లక్షల ఆస్తినష్టం

కాకినాడ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి వస్తున్న 40 ఫీట్ ట్రైలర్ ట్రక్ వాహనం క్యాబిన్ షార్ట్ సర్క్యూట్‌కు గురై దగ్ధమైన సంఘటన మంగళవారం రాత్రి కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ నుం చి కాకినాడకు హోర్డింగ్ మెటీరియల్‌తో వస్తున్న ట్రైలర్ ట్రక్ కాకినాడ సమీపంలో ఉన్న ప్రతాప్‌నగర్ వంతెన వద్దకువచ్చేసరికి వాహనం క్యాబిన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడి వ్యాపించాయి. వెంటనే వాహన డ్రైవర్ అతడి సహాయకుడు బయటకు దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. అది గమనించిన స్థానికులు అగ్ని మాపక శాఖకు సమాచారం ఇచ్చారు. సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు సిబ్బంది, ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే క్యాబిన్ ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది. ఆస్తినష్టం సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ఏడీఎఫ్‌వో తెలిపారు.

హరోంహర..

కత్తిపూడిలో వైభవంగా తీర్థకావిడి ఉత్సవం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాలు





కత్తిపూడిలో ఊరేగింపు



కలశాలు తీసుకెళుతున్న మహిళలు

శంఖవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తీర్థకావిడి ఉత్సవం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్యుడి మాలధారులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఈ వేడుక జరిగింది. తెల్లవారుజాము నుంచి స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కలశాలతో తీర్థకావిళ్లను అనుసరించి గ్రామోత్సవం నిర్వహించారు. కలశాలతో తీసుకువచ్చిన జలాలతో మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. హరోంహర నామంతో గ్రామం మార్మోగింది. కోలాటం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఛైర్మన్ గాబు గంగ భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రోడ్డు డెవలప్మెంట్ బోర్డు డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు ఉన్నారు.

అపీత కుచాంబకు ధాన్యాలంకరణ

ప్రత్తిపాడు మండలం రాచపల్లి అరుణాచల క్షేత్రంలో పంచామృతాభిషేకాలు

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద గల అరుణాచల క్షేత్రంలో కొలువైన అపీత కుచాంబ అమ్మవారికి మంగళవారం ధాన్యాలంకరణ చేశారు. కార్తీక బహుళ షష్టి పురస్కరించుకుని అమ్మవారి ఆలయ గుమ్మానికి వరి కంకులతో కూడిన ధాన్యం గుత్తులు వేలాడ దీసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సుబహ్మణ్యేశ్వర స్వామి, అరుణాచలేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భార త మాత హోమాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రమానంద ఆధ్వర్యంలో వేద పండితులు పుష్కరిణి వద్ద హారతులు ఇచ్చారు. ధ్వజ స్తంభం వద్ద ఆకాశ పూజలు నిర్వహించారు.





ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో పుష్కరిణి వద్ద హారతులు ఇస్తున్న మహిళలు, అపీత కుచాంబ అమ్మవారికి ధాన్యాలంకరణ

అమలాపురం

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

ఐ.పోలవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. మురమళ్ళ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకుడు దాట్ల పృథ్వీరాజు రూ.1.56లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపన బాబు, ఏలూరి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లి వరకు పాదయాత్ర



మామిడికుదురు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మగటపల్లి గ్రామం నుంచి భక్తులు గోవింద నామస్మరణచేస్తూ మంగళవారం పాదయాత్రగా అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధికి వచ్చారు. వారికి దారిపొడువునా పలుచోట్ల వివిధ గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. అప్పనపల్లిలో వీరికి అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించి ఆశీర్వచనం ఇచ్చారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకే పాల్ ల్యాబ్స్



అమలాపురం బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

అమలాపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు, అభ్యసనాస్థాయిని మెరుగుపరిచేందుకు పాల్ ల్యాబ్స్ ఎంతో దోహదపడతాయని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. అమలాపురం బాలికోన్నత పాఠశాలలో పాల్ ల్యాబ్స్ ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం జిల్లా కోఆర్డినేటర్ పి.రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 1224 పాఠశాలల్లో పాల్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగా మరో 278పాఠశాలల్లో ఈల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. పాల్ ల్యాబ్‌ల ద్వారా రాష్ట్రంలో 3.25లక్షల మంది విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉందన్నారు. పాల్‌ల్యాబ్స్ వినియోగంలో కోనసీమ జిల్లా తృతీయ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ జి.మమ్మి, స్టేట్ కోఆర్డినేటర్ బి.కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో పాల్ ల్యాబ్ వినియోగంలో వరుసస్థానాల్లో నిలిచిన ఐ.పోలవరం, సమనస, కాట్రేనికోన జిల్లాపరిషత్ ప్రధానోపాధ్యాయులకు రవీంద్రనాథ్‌రెడ్డి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ ఐఈ కోఆర్డినేటర్ నరసింహారావు, టీచ్ టూల్ స్టేట్ కోఆర్డినేటర్ మాధవీలత, సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీసుబ్రహ్మణ్యం, ఎంఈవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఏపీసీ జి.మమ్మీ సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి, హెచ్ఎం భమిడిపాటివెంకటరామకృష్ణ, వివేక్, ఎ.శశికుమార్ పాల్గొన్నారు.

ప్రజల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలి



కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న యూనియన్ బ్యాంకు అధికారులు

అమలాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వివిధ కుటీర పరిశ్రమల ఏర్పాటులో శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రజలు ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. యర్రమిల్లివారివీధిలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. 1నుంచి 45ఏళ్ల వయసు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత వసతి, భోజనం వంటి సదుపాయాలతో సహా నైపుణ్య శిక్షణ పూర్తిస్థాయిలో అందించి వారికి బ్యాంకు రుణాల ద్వారా జీవనోపాధిని కల్పించాలని సూచించారు. యువత ఉపాధికి అనువైన వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు తీసుకురావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఉదాహరణకు వీడియో ఎడిటింగ్, ఫొటోగ్రఫీ, బ్యూటీషియన్ వంటి కోర్సులపై శిక్షణ కల్పించాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ మేనేజర్ బీజీఆర్ నాయుడు, సెంటర్ డైరెక్టర్ రమ్య, నాబార్డు డీజీఎం స్వామినాయుడు, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ కేశవవర్మ, మెప్మా పీడీ అన్నపూర్ణ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి వ్యాఖ్యలపై కోర్టును ఆశ్రయిస్తాం

● జనసేన నాయకులు



పి.గన్నవరంలో మాట్లాడుతున్న శిరిగినీడి వెంకటేశ్వరావు

పి.గన్నవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి మంజూరు విషయంలో వైసీపీ నియోజకవర్గ నాయకుడు ఏదో ఆశించి అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఆ నాయకుడికి దమ్ము, ధైర్యం ఉంటే ఆధారాలను బయటపెట్టాలని నీటిపారుదల శాఖ డైరెక్టర్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ 600మంది లబ్ధిదారులకు రూ.4.85కోట్లు అందించారన్నారు. ఆ నాయకుడి వ్యాఖ్యలపై కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, వాసంశెట్టి కుమార్, కె.సత్యనా రాయణరాజు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, దొమ్మేటి సాయికృష్ణ, పాలూరి పణి, యల్లమిల్లి చిట్టిబాబు, శేరు శ్రీనుబాబు, నూకపెయ్యి ప్రసన్న కుమార్, తోలేటి నారాయణమూర్తి, అన్నాబత్తుల హనుమాన్, తాటికాయల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

అంబాజీపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పేదల కోసం నీతి నిజాయితీతో పనిచేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణపై వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అసత్య ఆరోపణలు చేయడం దారుణమని నీటిపారుదలశాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. అంబాజీపేట పద్మాజీ గ్రాండ్, కొర్లపాటివారిపాలెంలో జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు వ్యాఖ్యలను కూటమి నాయకులు ఖండించారు. ఎమ్మెల్యేకు శ్రీనివాసరావు బహిరంగ క్షమాపణ చెప్పే వరకూ ఆయన పాల్గొనే కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. సొసైటీ ఛైర్మన్లు అరిగెల సూరిబాబు, సుంకర గణపతిరావు, అల్లాడ రవి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, నాయకులు పెదపూడి శ్రీనివాసరావు, అరిగెల బలరామమూర్తి, మైపాల తాతాజీ, మట్టపర్తి సోమేశ్వరరావు, సుంకర బాలాజీ, నాగాబత్తుల సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజలే బుద్ధిచెబుతారు

మామిడికుదురు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణపై అసత్య ఆరోపణలు చేస్తే నియోజకవర్గ ప్రజలు బుద్ధిచెబుతారని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా పేర్కొన్నారు. వైసీపీ పి.గన్నవరం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పాశర్లపూడిలో ఎమ్మెల్యే గిడ్డిపై చేసిన ఆరోపణలను కూటమి నాయకులు తీవ్రంగా ఖండించారు. నగరంలో వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే అవినీతికి పాల్పడుతున్నారనడం హాస్యాస్పదమన్నారు. ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, నాయకులు మెండా ఆదినారాయణ, బోనం బాబు, మద్దాల పెద్దకాపు, చుట్టుగుళ్ల కిశోర్, విళ్ల సుబ్బారావు, మందా గాంధీ, గాలిదేవర దేవి పాల్గొన్నారు.

పంట జాతర

అమలాపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మతల్లి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం పంట జాతర నిర్వహించారు. శ్రీసుబ్బాలమ్మ, నూకాలమ్మ, రాజ్యలక్ష్మి అమ్మవార్ల పంటల జాతర సందర్భంగా దేవస్థానం ఛైర్మన్ అప్పన వీరన్న ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ధర్మకర్త సరిదే నాగరాజకుమారి పాల్గొన్నారు.

ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమం

రాజోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పొదలాడలో దళిత చైతన్యవేదిక నాయకులు ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు జెండా ఊపి ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి దళిత చైతన్యవేదిక నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ శ్యామ్‌బాబు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, విప్పర్తి సాయిబాబు, మట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో షణ్ముఖసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

అంతర్వేది,నవంబరు11(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో బ్రహ్మచే ప్రతిష్ఠించబడిన క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. సంతానం, వివాహం, నూతనగృహ కల్పన వంటివి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆశీస్సులతో జరుగుతున్నాయని భక్తుల నమ్మకం.

అంతర్వేదిపాలెం, రామేశ్వరంలో తాగునీటి ఇక్కట్లు



అంతర్వేది ప్రకాశపురం గ్రామస్తుల నిరసన

అంతర్వేది, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో అంతర్వేదిపాలెం, రామేశ్వరం గ్రామాల్లో మంచినీటి చెరువులు ఉన్నప్పటికీ పదహారు గ్రామాల్లో ఎక్కడో చోట తాగునీరు రాక ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా అంతర్వేది ప్రకాశపురం చివరి ప్రాంతంలో 20గృహాల వారు సంవత్సరకాలంగా తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం అంతర్వేది ప్రకాశపురం మారుమూల ప్రాంతంలో ఖాళీ బిందెలతో ప్రజలు నిరసన చేపట్టారు. ఇష్టానుసారంగా పైపులైన్లకు మోటార్లు బిగిస్తున్నా వారిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఏ గ్రామంలోకి వెళ్లినా స్థానిక ప్రజాప్రతినిధులకు మాకు తాగునీరు రావడం లేదని, మా తాగునీటి సమస్యను పరిష్కరించేది ఎవరని ప్రశ్నలు సంధిస్తున్నారు. అక్రమ కుళాయి కనెక్షన్లు తొలగించడంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజు విడిచి రోజైనా తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులు, నాయకులను కోరుతున్నారు.

వైభవంగా మహారుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన



శంకరనారాయణ క్షేత్రంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు, భక్తులు

అయినవిల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస బహుళ షష్ఠి మంగళవారం యల్లకల్లంకలో గల బ్రహ్మ సూత్ర శివలింగ స్వరూప శంకరనారాయణ స్వామి క్షేత్రంలో మహారుద్రాభిషేకం, లక్షపత్రిపూజ, శాంతి కల్యాణం, దాతలు మంజేరు దొరబాబు గురువులు, కాకినాడకు చెందిన ఆకెళ్ల వెంకటసత్యనారాయణమూర్తి దంపతుల ఆధ్వర్యంలో ముక్కామల వేదపండితులు ఆకెళ్ల రాజబాబు నేతృత్వంలో పూజలు నిర్వహించారు. స్వామివారికి గంగాజలంతో అభిషేకం జరిపారు. అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఆక్వారైతుగా ఈలప్రోలు



యానాం,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యానాం ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి, ఆక్వా ప్రగతిశీల రైతు ఈలప్రోలు విష్ణువర్ధనరావు ఉత్తమ ఆక్వారైతు పురస్కారం అందుకున్నారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు, వరల్డ్ ఆక్వాకల్చర్ సొసైటీ సంయుక్త నిర్వహణలో హైదరాబాదులో భారత మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు వివిధ రాష్ట్రాల ఉత్తమ రైతులను ఎంపిక చేసి సత్కరించారు. తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర మత్స్యశాఖ ఛైర్మన్ ఎం.సాయికుమార్, నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డుచీఫ్ ఎగ్జిక్యూటివ్ విజయ్ కుమార్ నుంచి పురస్కారం అందుకున్నారు.

అబుల్‌కలాంకు ఎంపీ హరీష్ నివాళి



అబుల్‌కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీ హరీష్‌బాలయోగి

అమలాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర సమరయోధుడు, దేశప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానాఅబుల్‌కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని అమలాపురంలోని గొల్లగూడెంలో అబుల్‌కలాం విగ్రహానికి ఎంపీ గంటి హరీష్‌బాలయోగి పూలమాలలువేసి నివాళుల్పించారు. అమలాపురం పట్టణంలోని గొల్లగూడెంలో జరిగిన కార్యక్రమంలో ముస్లిం పెద్దలతో పాటు ఎండీ బషీర్, ఇతర నాయకులు పాల్గొన్నారు. అనంతరం పిల్లల సమక్షంలో అబుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి వేడుకలు జరిపారు. భారీగా ముస్లిం నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆజాద్‌కు ఘన నివాళి

యానాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్నత విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు యానాంలో అధికారులు ఘన నివాళులర్పించారు. మంగళవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవంలో భాగంగా ఫెర్రీ రోడ్డులో ఆయన విగ్రహానికి పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఎస్పీ వరదరాజన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, ఉపాధ్యాయుడు హంసాని రామలక్ష్మణుడు పూలమాలలువేసి ఘనంగా నివాలులర్పించారు. యానాం సమాచార శాఖాధికారి కేఎల్‌వీ ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా అబుల్‌కలాం జయంతి

నివాళులర్పించిన ఏవో విశ్వేశ్వరరావు, అదనపు ఎస్పీ ప్రసాద్



జిల్లా పోలీసు కార్యాలయంలో అబుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ ప్రసాద్

అమలాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దేశంలో తొలిబాటవేసిన విద్యాధికుడు జనాబ్ మౌలానా అబుల్‌కలాంఆజాద్ అని కలెక్టరేట్ ఏవో కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అబుల్‌కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలు నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించిన అనంతరం కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ బషీర్‌హుస్సేన్, నాయకులు మీరాన్‌షరీఫ్, ముస్లిం పెద్దలు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

ఎస్పీ కార్యాలయంలో అబుల్‌కలాంఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ కలాం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలానాఆజాద్ జీవితం, సేవలను వివరించి వాటిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మక్కాలో జన్మించిన ఆయన కలకత్తాలో విద్యాభ్యాసం కొనసాగించారని, స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ ఆదర్శాలకు అనుగుణంగా నడుచుకుంటూ దేశ స్వాతంత్ర్యం కోసం అవిశ్రాంతంగా కృషిచేసిన వ్యక్తి అన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సీఐ పుల్లారావు, ఏఆర్‌ఆర్‌ఐలు బ్రహ్మానందం, కోటేశ్వరరావు, దిలీప్, ఏలూరు పోలీసు కార్యాలయ ఏవో ఎస్.బాలాజీ అబుల్‌కలాం జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

మెట్ల రమణబాబు జన్మదిన వేడుక



కొమరగిరిపట్నంలో మెట్ల రమణబాబు జన్మదిన వేడుకలో అభిమానులు

అల్లవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొమరగిరిపట్నం ఎంఆర్ఎం సొసైటీ ఛైర్మన్ మెట్ల రమణబాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. టీడీపీ, బీజేపీ, కూటమి నాయకులు, అభిమానుల సమక్షంలో రమణబాబు జన్మదిన కేక్‌ను కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. టీడీపీ నాయకులు సంగీతం తాతాజీ, మంతెన సురేష్‌రాజు, గుర్రం నరసింహమూర్తి, సొసైటీ సీఈవో కొమ్మూరి సత్తిబాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ముత్యాల బాబి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, అరవ చంటి, మొయిల గణపతి తదితరులు రమణబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొమరగిరిపట్నంలో రమణబాబు జన్మదినోత్సవం సందర్భంగా మెట్ల చినకాపు అయ్యప్పస్వాములకు మంగళవారం భిక్ష ఏర్పాటుచేశారు.

యూత్ ఫెస్టివల్‌లో విద్యార్థుల ప్రతిభ



వి.జాహ్నవి, ఎం.ఐశ్వర్య

అల్లవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ యూత్ ఫెస్టివల్ పోటీల్లో ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థినులు వి.జాహ్నవి, ఎం.ఐశ్వర్యలు రచన, కవిత్వం పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలు జాహ్నవి, ఐశ్వర్యలను బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, ఛైర్‌పర్సన్ బోనం కనకదుర్గ, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆకుల ప్రవీణ్, కల్చరల్ కన్వీనర్ టి.ఆంజనేయులు అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలి



అమలాపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కాకినాడ జేఎన్‌టీయూ కెపాసిటి బిల్డింగ్ డైరెక్టర్ రవీంద్ర పేర్కొన్నారు. భట్లపాలెం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం పీజీ విద్యార్థుల సెర్మనీ కార్యక్రమం కళాశాల ఛైర్మన్ బోనం కృష్ణసతీష్ అధ్యక్షత జరిగింది. ఈసందర్భంగా ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ విభాగాల విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయడంతో పాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏఎస్‌వీజే రాజగోపాల్, గవర్నింగ్ బాడీ సభ్యులు బి.విజయలక్ష్మి, జేవీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ముమ్మిడివరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కోర్టు ఆవరణలో న్యాయవాది ఎ.రాజశేఖర్‌పై దాడిని నిరసిస్తూ ముమ్మిడివరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడిచేయడం, హత్యలకు పాల్పడడం పరిపాటిగా మారిందని, ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, కార్యదర్శి మట్టపర్తి వెంకటేశ్వరరావు, న్యాయవాది దోనిపాటి ఆంజనేయులు, కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు, జీవీ వెంకటరామారావు, కేఎల్వీ ప్రసాద్, పి.నరేష్, కోన అఖిల్, ఎం.రమ్య పాల్గొన్నారు.

అంతర్వేదిలో పారిశుధ్య చర్యలు

అంతర్వేది, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పంచాయతీ పరిధిలో మొంథా తుఫాన్ అనంతరం మంగళవారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. పల్లపు ప్రాంతాల్లో, ప్రతీ ఇంటి చుట్టూ బ్లీచింగ్ చల్లి దోమలు రాకుండా సిబ్బంది ఫాగింగ్ చేస్తున్నారు. అలాగే ముంపునకు గురైన కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ముంపు నీటిని తరలించే చర్యలు చేపడుతున్నట్టు సర్పంచ్ పోతురాజు నరసింహారావు (కిశోర్), కార్యదర్శి ప్రత్యూష్ తెలిపారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మలికిపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ అంగన్‌వాడీల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌ఇందిర అన్నారు. మంగళవారంమోరిపోడులో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీచేశారు. పిల్లల బరువులను, రికార్డులను పరిశీలించారు. పలువురు గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి బరువులను, వారు పొందుతున్న టీకాల వివరాలు పరిశీలించారు. సూపర్‌వైజర్ కె.చంద్రకళ పాల్గొన్నారు.

మోరిలో భవానీల కలశ పూజ

మలికిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మోరి పుంతలో ముసలమ్మ ఆలయ ప్రాంగణంలో భవానీల 18కలశల పూజ వైభవంగా నిర్వహించారు. మంగళవారం భవానీలు కలశలతో పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మంగళంపల్లి సత్తిపండు గురుభవానీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. టేకిశెట్టిపాలెం జ్యోతిస్వరూప అయ్యప్పస్వామి భజన సమాజం కటికిరెడ్డి మహేష్‌గురుస్వామి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భవానీలు, అయ్యప్పలు పాల్గొన్నారు.

దెందుకూరి చొరవతో గురుకుల కళాశాలలో వెలుగులు

అల్లవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గోడి గురుకుల కళాశాలలో అండర్ గ్రౌండ్ విద్యుత్ తీగలు చెడిపోయి మూడు రోజులుగా విద్యార్థులు అంధకారంలో చదవడానికి ఇబ్బందులు పడుతూ స్నానాలకు నీటి సమస్య తలెత్తి ఇబ్బందులకు గురవుతున్నారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు స్పందించి సొంత నిధులతో కొత్తగా విద్యుత్ కేబుల్‌ను అమర్చే ఏర్పాట్లు చేయించారు. సమస్యను పరిష్కరించిన సత్తిబాబురాజును ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, సర్పంచ్ తోట శ్రీదేవినరసింహారావు, ఎంపీటీసీ కాంద్రేగుల వాణీఅచ్యుతం, సత్యనారాయణ అభినందించారు.

గొల్లపల్లికి మాజీ ఎంపీ పరామర్శ

అల్లవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని అమలాపురం కిమ్స్‌ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును మాజీ ఎంపీ చింతా అనురాధ, వైసీపీ రాష్ట్రరైతువిభాగ అధ్యక్షుడు జిన్నూరి రామారావు, జడ్పీటీసీ కొనుకు గౌతమీ, సర్పంచ్ బర్రె సీతారత్నంలు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని వారుఆకాంక్షించారు.

ముమ్మిడివరంలో వేద పాఠశాల ప్రారంభం



వేద పాఠశాలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ముమ్మిడివరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హిందూ మత పరిరక్షణకు వేదాలను అభ్యసించేందుకు కల్లూరి చారిటబుల్ ట్రస్టు వేద పాఠశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు పేర్కొన్నారు. ముమ్మిడివరం అగ్రహారంలో కల్లూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాఠశాల, గోశాల, యాగశాలను మంగళవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూ వేదాలను అభ్యసించడంతో పాటు గోవులను పరిరక్షించడం ప్రతీ హిందువు నైతిక బాధ్యతగాస్వీకరించాలన్నారు. చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు కల్లూరి సుబ్రహ్మణ్యం, హేమమాలిని, కౌన్సిలర్ ములపర్తి బాలకృష్ణ, నాయకులు కట్టా సత్తిబాబు, యాళ్ల ఉదయ్, చప్పిడి ప్రసాద్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు సత్కారం

ముమ్మిడివరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా పి.రవివర్మ బాధ్యతలుస్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా నగర పంచాయతీ, సచివాలయ, మెప్మా సిబ్బంది ఆయన్ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముమ్మిడివరం నగరపంచాయతీ కమిషనర్‌గా రెండోసారి పనిచేసేందుకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అవకాశం కల్పించారని, ఉద్యోగులందరి సహకారంతో నగరపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఏఈ కె.శ్రీనివాస్, టీపీవో బి.రాజేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణప్రసాద్ (సీ1), ఆర్ఐ భాస్కరరావు, సీనియర్ అసిస్టెంట్ సునీత, లక్ష్మీనారాయణ, కె.రవిశంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ద్వారా మరిన్ని సేవలు

అంబాజీపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):యూనియన్ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మరిన్ని సేవలందిస్తామని యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎంవీఎస్ మూర్తి అన్నారు. యూనియన్ బ్యాంకు 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక యూనియన్ బ్యాంకులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఖాతాదారులకు అందించే సేవలను వివరించారు. అనంతరం ప్రముఖ వ్యాపారులు అప్పన ప్రభాకరరావు, కాసు సాయిబుజ్జిలతో కేక్‌ను కట్ చేయించారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు సన్మానం

మలికిపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్‌లో విశిష్ట సేవలు అందించినందుకు కలెక్టర్ చేతులమీదుగా అవార్డుఅందుకున్న తహశీల్దార్ టి.శ్రీనివాసరావును, వీఆర్వో హరికిషన్‌లను రెవెన్యూ అసోసియేషన్ సన్మానించింది. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు బోనం మృతి



కాట్రేనికోన, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మొక్కలతిప్ప గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు బోనం సూరిబాబు మంగళవారం మృతి చెందారు. వాకింగ్ చేస్తుండగా బైక్ ఢీకొట్టడంతో ఆయన మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ఆయన మృతితో మొక్కలతిప్పలో విషాదఛాయలు నెలకొన్నాయి. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్, నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్ తదితరులు బోనం మృతికి సంతాపం తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

యానాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):యానాంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్ర మం కార్యక్రమాన్ని నిర్వహించారు. యానాం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యానాం ఎస్పీ వరదరాజన్ మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. డ్రైవర్లు పేర్లు, బ్యాడ్జిలతో యూనిఫారం తప్పనిసరిగా ధరించాలన్నారు. ఎస్ఐలు పునీత్‌రాజా, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, ఆటో యూనియన్ డ్రైవర్లు పాల్గొన్నారు.

మహా పుష్పయాగం

అమలాపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పార్వతీ పరమేశ్వరుల దివ్య కల్యాణం నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ రకాల పరిమళ పుష్పాలతో స్వామి-అమ్మవారికి మహాపుష్పయాగం నిర్వహించారు. చింతా మల్లికార్జునరావు-వీరవెంకటరాజ్యలక్ష్మి దంపతులు కర్తలుగా ఆలయ పురోహితులు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో పుష్పయాగం నిర్వహించి దంపత తాంబూలాలు అందించారు. చింతా అత్తిలింగం-వీరభద్రమణి, చింతా శంకరమూర్తి-చంద్రకళ, గుత్తి స్వామి-మంగామణి దంపతులతో పాటు కొండా చంటి, యినుమర్తి లింగమూర్తి దంపతులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలతోపాటు రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలంలో రెండు ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. నర్సిపూడి-సంధిపూడి రోడ్డు నిర్మాణానికి రూ.3.80 కోట్లు, జొన్నాడ-మండపేట రోడ్డు మరమ్మతులకు రూ.2.75 కోట్లు కేటాయించడంతో మంగళవారం వాటి పనులను ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ఇటీవల ఈ రోడ్లు తుఫాన్, అధిక వర్షాల వల్ల దెబ్బతిన్నాయని వాటిని త్వరితగతిన పనులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్‌అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్‌లను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి డీఈ సూర్యనారాయణ, ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, నాయకులు ఈదల సత్తిబాబు, సంగిత సుభాష్, దునే స్వామినాయుడు, రాయుడు సతీష్, గుత్తుల శ్రీరాములు, సలాది నాగేశ్వరరావు, వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, వైట్ల శేషుబాబు, దొడ్డా సుబ్బారావు, దండంగి రామారావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

ఆలమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సంధిపూడిలో ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజను భక్తిశ్రద్ధలతో జరిపారు. సంధిపూడి గ్రామానికి చెందిన మానేపల్లి మాచరరావు 36వ సారి అయ్యప్ప మాలధార సందర్భంగా దీన్ని నిర్వహించారు. పడిపూజ నిర్వహణలో గుర్తింపు పొందిన తాటిపాక కృష్ణస్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి అయ్యప్పమాలధారణలోఉన్న అయ్యప్ప భక్తులు ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని పడిపూజను నిర్వహించారు. తాటిపాక కృష్ణస్వామి చేసిన పడిపూజతోపాటు 108 నామాలతో అయ్యప్ప శరణు ఘోష, అయ్యప్ప భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



సంధిపూడిలో జరిగిన అయ్యప్ప పడిపూజలో గురుస్వామి తాటిపాక కృష్ణస్వామి, భక్తులు

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం మంగళవారాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రికి చెందిన పి.ఈశ్వర్, లక్ష్మీదేవి దంపతులు రూ. 1,00,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. క్షేత్రపాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తజనం పోటెత్తారు.



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

రైతులను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రాలు

ఆలమూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ కారణంగా రైతులు నష్టపోయారని వారిని తక్షణం ఆదుకునే కార్యక్రమం చేపట్టాలని ప్రతిపక్ష నాయకులు కేంద్ర బృందానికి వినతిపత్రాలు అందించారు. ఆలమూరు, పెనికేరులో పంట నష్టాలను పరిశీలించడానికి విచ్చేసిన కేంద్ర బృందాన్ని కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, వైసీపీ ప్రతినిధిగా మాజీ ఎంపీ చింతా అనూరాధ, నాయకులు బాబి, నాగిరెడ్డి, తమ్మన శ్రీనివాస్ తదితరులు కేంద్ర బృందానికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. రైతుల ఖరీఫ్ వరిపంటకు అధిక శాతం నష్టం కలిగిందని అందువల్ల వారికి తక్షణ సాయం అందించాలన్నారు. రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వారు కోరారు. మీ విజ్ఞప్తిని పరిశీలిస్తామని కేంద్ర బృందం వారికి హామీ ఇచ్చారు.



పెనికేరులో కేంద్ర బృందానికి వినతి పత్రాలు అందజేస్తున్న దృశ్యం



రావులపాలెం క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

అర్హులకు సీఎం సహాయ నిధి అందజేత

రావులపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి సీఎం సహాయ నిధి అందిస్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. రావులపాలెం మండలానికి చెందిన ఏడుగురికి రూ.2.61 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఆత్రేయపురం మండలానికి చెందిన 13, కొత్తపేట మండలానికి చెందిన 9, ఆలమూరు మండలానికి చెందిన 8 మందికి చెక్కులను అందించామన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, కొప్పిశెట్టి ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు అనుసరణీయం

కొత్తపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు అజరామరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం ఆయన జయంతిని పురస్కరించుకుని వాడపాలెంలో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎం సమస్యలపై గ్రామసభ

కె.గంగవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జాయింట్ ఎంపీఎల్ సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. దీనిని సీసీఎల్‌ఏ ఆదేశాలతో నిర్వహిస్తున్నట్లు ఏడి ప్రభాకర్ తెలిపారు. సభలో మండల సర్వేయర్ పావని గ్రామసభ ఆవశ్యకత తెలిపారు. సభలో ఏడి ప్రభాకర్, డీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రీసర్వే సమయంలో కొంత మంది రైతులు అవగాహన లేక డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేసుకోకపోవడం, టెక్నికల్ సమస్యలతో జాయింట్ ఎల్‌పియం సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. దీనివల్ల కొంత మంది రైతుల ఖాతాల్లో ఉన్నదాని కంటే ఎక్కువ చూపిస్తున్నాయని, దీనివల్ల వారు ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నారు. ఇటువంటి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం డిసెంబరు 31 వరకూ జాయింట్ ఎల్‌పియంలు డివిజన్ చేసుకోవడానికి అవకాశం కల్పించింది. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ రికార్డులు సరిచేసుకోవాలని వారు కోరారు.



గ్రామసభలో మాట్లాడుతున్న దృశ్యం

రైతు సేవా కేంద్రాల ద్వారా పంటను విక్రయించుకోవాలి

కె.గంగవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా పంటను విక్రయించుకుని మద్దతు ధర పొందాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్ అన్నారు. మంగళవారం కుందూరు గ్రామంలోని సహకార సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సొసైటీ అధ్యక్షుడు జగతా రమణ అధ్యక్షత వహించారు. వ్యవసాయశాఖ ఏడిఏ బి.నాగకుమార్ ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరివాడ చిన్నికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, కుందూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మేడిశెట్టి బాబి, యర్రపోవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, మండల వ్యవసాయశాఖ అధికారి ఏ.సుద్దుగురుమూర్తి, ఎంపీఈవో రేవతి, కూటమి నాయకులు పళ్ల చినబాబు, సలాది దుర్గ, సిర్రా సురేష్, అనిశెట్టి రాంబాబు, పామర్తి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

కె.గంగవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామంలో మంగళవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఎకరాకు సుమారుగా 20 బస్తాలు వస్తుందని వ్యవసాయశాఖ విఏఏ హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌వో భద్రరావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది



పేరవరం వినాయకుడి గుడి వద్ద నిర్వహించిన దీపోత్సవం

ఘనంగా దీపోత్సవం

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పేరవరం వినాయకుడి ఆలయం వద్ద కార్తీకమాసం మంగళవారాన్ని పురస్కరించుకుని రాత్రి దీపాలంకరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తజనం లింగాకారంలో దీపాలు వెలిగించారు. శంకు, చక్ర నామాలతో కార్తీక దీపాలను వెలిగించగా, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో స్వామివారికి లక్షపత్రి పూజ నిర్వహించిన దృశ్యం

భక్తి శ్రద్ధలతో లక్షపత్రిపూజ, ఏకాదశ రుద్రాభిషేకం

కపిలేశ్వరపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలో నున్న అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి లక్షపత్రి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, జ్యోతిర్లింగార్చన తదితర పూజలను నిర్వహించారు. వై.కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో పలువురు వేద పండితులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్షపత్రి, జ్యోతిర్లింగార్చన, ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ దినం

కె.గంగవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ దినాన్ని పామర్రు శాఖలో మంగళవారం నిర్వహించారు. మేనేజర్ జ్యోతి వినియోగదారులకు బ్యాంక్ సేవలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సుధీర్, మిర్సీ, ఫణీంద్ర, కుమార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఇంటర్ కాలేజీయేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పి.నిర్మలకుమార్ ప్రతిభ కనబరిచాడన్నారు. ఈ చాంపియన్‌షిప్ పోటీ ల్లో 81 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించడంతో ప్రిన్సిపాల్‌తో పాటు స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఎస్.చినబాబు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌బాబుతో పాటు పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు వారిని అభినందించారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొత్తపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ యాళ్ల లక్ష్మణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని టెన్నికాయిట్ పోటీల్లో బాపట్లలో జరిగిన పోటీలలో విజయం సాధించి ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ జమ్మూకశ్మీర్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎమ్ఎల్‌టీ గ్రూప్ చదువుతున్న గుమ్మడి శ్యామ్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన వారిద్దరినీ పలువురు అధ్యాపకులు సిబ్బంది తదితరులు అభినందించారు.

మొబైల్ ఫోన్ల రికవరీ

రావులపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను మంగళవారం టౌన్ సీఐ శేఖర్‌బాబు మంగళవారం అందజేశారు. సుమారు రూ.4.20 లక్షల విలువైన 11 సెల్‌ఫోన్లను వారికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. సెల్‌ఫోన్ భద్రతలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

• రైతులకు ఎమ్మెల్యే సత్యానందరావు హామీ • ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం కట్టుంగ రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో నాలుగు మండలాల్లో 6,614 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. హెక్టారు వరికి రూ.25వేలు, అరటికి రూ.35 వేలు, కూరగాయలు, పూలతోటలు రూ.25వేలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. అనంతరం ధాన్యం తేమ శాతాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ రామారావు, ఏవో మహేష్ కుమార్, తహశీల్దారు రాజేశ్వరరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, దొడ్డపనేని త్రినాధ్, జుజ్జవరపు హరిబాబు, కరుటూరి ప్రసాద్, పెండెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన: సెంట్రల్ డెల్టాకు సాగునీరు అందించే లొల్లలాకుల ప్రాంతాన్ని సుందరీకరణ చేస్తున్నారు. మంగళవారం ఎమ్మెల్యే సత్యానందరావు వాటి పనులను పరిశీలించారు. కార్తీకమాసంలో వనభోజనాలు నిర్వహించుకునేందుకు అనుగుణంగా లాకుల ప్రాంతాన్ని తీర్చిదిద్దుతున్నారు. వాడపల్లి ఆలయానికి వెళ్లే భక్తులు లాకుల అందాలను ఆస్వాదించే విధంగా అన్ని చర్యలు చేపట్టారు. కూటమి శ్రేణులు అధికార యంత్రాంగంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.



కట్టుంగలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

నిధుల కేటాయింపుపై టీడీపీ, వైసీపీ సభ్యుల వాగ్వాదం

• వాడివేడిగా కపిలేశ్వరపురం మండల సర్వసభ్య సమావేశం • ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరు

కపిలేశ్వరపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ నిధుల కేటాయింపుపై సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీపీ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అంచనాల కమిటీ రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొంథా తుఫాన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని వారందరినీ ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎమ్మెల్యే వేగుళ్లను కోరారు. నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వ పాలనలో టీడీపీ, జనసేన సర్పంచ్‌లుగా గెలిచిన తమ గ్రామాల అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులో వివక్షత చూపారంటూ కపిలేశ్వరపురం గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, కోరుమిల్లి, వల్లూరు, కాలేరు, అద్దంకివారిలంక గ్రామాల సర్పంచ్‌లు ఆచంట సత్యనారాయణ, దాసి మీనాకుమారి, దాయం కావేరి, నాతి గవరయ్యలు పోడియం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీనిపై వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని కొంత సమయం ఇస్తే నిధుల విషయమై అందరితో చర్చించి తెలియజేస్తానని చెప్పగా అందుకు పలువురు సభ్యులు అంగీకరించకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వైసీపీ ఎంపీటీసీ, సర్పంచ్‌లు సమావేశం నుంచి వెళ్ళిపోయారు. దీనిపై ఎంపీడీవో భానూజీరావును వివరణ కోరగా మెజార్టీ సభ్యులు హాజరుకావడంతో సమావేశం కొనసాగిందన్నారు. తొలుత మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో విలీనం చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేను మండల పరిషత్, వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, సిబ్బంది తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





పోడియం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు. పక్క చిత్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ఈనెల 15న జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధిశాఖ కార్యాలయం, సిడాప్, సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15న రామచంద్రపురంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం తెలిపారు. ఈ జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం సత్యం ఆవిష్కరించారు. జాబ్‌మేళాకు 10 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, ఫార్మసీ అభ్యర్థులు అర్హులన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాసంశెట్టి సత్యం తదితరులు

టిడ్కో గృహాలను త్వరితగతిన ఇచ్చేందుకు చర్యలు

మండపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గొల్లపుంతకాలనీలో వున్న టిడ్కో గృహాల సముదాయం ఫేజ్ 1, 2లోని పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం టిడ్కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టిడ్కో ఏఈ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లలో విద్యుత్ వైరింగ్ పనులు జరుగుతున్నాయని త్వరలో పూర్తి చేస్తామన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు జంగిల్ పనులు చేపట్టాలని త్వరలో లబ్ధిదార్లకు ఇళ్లను ఇచ్చేందుకు సమాయత్తం కావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ బీవీ కిరణ్, టౌన్ ప్లానింగ్ అధికారి రమ్య, మున్సిపల్ ఏఈ పవన్ తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ రంగారావు

భూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మండల సర్వేయర్ పెద్దిరాజు పేర్కొన్నారు. మెర్లపాలెం సచివాలయంలో మంగళవారం సర్పంచ్ మెర్ల రాము అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గతంలో జరిగిన రీసర్వేలో భాగంగా ఏర్పడిన భూసమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం నామమాత్రపు ఫీజుతో జాయింట్ ఎల్‌పీఎంను సబ్‌డివిజన్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులుసద్వినియోగం చేసుకుని రైతులు సొంత భూమికి ఎల్‌పీఎం పొందవచ్చునన్నారు.

సంతాపం

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు ఆకస్మిక మృతిపై పార్టీలకు అతీతంగా నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆలయ చైర్మన్‌గా పనిచేసిన హయాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈయన మృతిపై పలువురు నేతలు సానుభూతి వ్యక్తం చేశారు. వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పీటీసీ బోనం సాయిబాబా, టీడీపీ మండల అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, ముళ్లపూడి భాస్కరరావు తదితర నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

వాహనాల తనిఖీ

రాయవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో మంగళవారం రాత్రి రాయవరంలో పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేశారు. రాయవరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది రాయవరం ప్రధాన రహదారితో పాటు పలు కూడళ్లలో ప్రయాణించే వాహనాలను పోలీసులు తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలతో పాటు, రికార్డులు సక్రమంగా లేని వాటికి అపరాధ రుసుము విధించారు.

రావులపాలెంలో కార్తీక వన సమారాధన

రావులపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో కాపు కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని సంఘ గౌరవ అధ్యక్షులు ఆకుల రామకృష్ణ, సంఘ అధ్యక్షుడు నందం వీరవెంకట సత్యనారాయణ, సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భీమేశ్వరాలయంలో లక్షబిల్వార్చన

ద్రాక్షారామ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలో నున్న మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్షపత్రి పూజ జరిగింది. ఆలయ అర్చకులు ఉండి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో లక్షపత్రిపూజ నిర్వహించారు. ముందుగా స్వామికి అభిషేకం జరిపారు. తదుపరి లక్షపత్రి పూజ, సూర్య నమస్కారాలు, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి దంపతులు, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, చోడిశెట్టి వీరభద్రరావు, చక్కా తాతాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధన

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో మంగళవారం శెట్టిబలిజ వర్గీయుల వనసమారాధన జరిగింది. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, మాజీ చైర్మన్ పాలిక శ్రీనివాస్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, వైద్యులు డాక్టర్ కాదా వెంకటరమణ, యనమదల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ కోట వెంకట సతీష్, డాక్టర్ పెంకె ఆనంద భాస్కర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి గౌరీశంకర్, నున్నబోయిన దుర్గాప్రసాద్, దంగేటి గౌరీశంకర్, నరాల శేఖర్, అధిక సంఖ్యలో శెట్టిబలిజ వర్గీయులు పాల్గొన్నారు.

'మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

మండపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని వైసీపీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేటలో వున్న వైసీపీ కార్యాలయంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పోతుల ప్రసాద్, కోనాల చంద్రశేఖర్, యారమాటి వెంకన్నబాబు, వీరాస్వామి, ఎం.బాపిరాజు, కోళ్ల శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.